సాక్షి ఏలూరు

గురువారం । 5 । అక్టోబర్ । 2023



ప్రతి ఇంటా ఆరోగ్యం

జగనన్న ఆరోగ్య సురక్షలో ఉమ్మడి పశ్చిమగోదావరిలో పలు ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 8లో



మాతాశిశు మరణాలకు చెక్

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా అక్షజ కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. పౌష్టికాహార కిట్‌లను అందజేస్తామన్నారు. 8లో ▸



దుబాయ్ నుంచి స్వదేశానికి

ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ మహిళకు టీబీ సోకగా, వైద్యం కోసం అర్జీ పెట్టుకుంది. ఎట్టకేలకు ఉన్నతాధికారుల సహకారంతో ఆమె ఏలూరు చేరుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలో మునగ మొక్క నాటిన కలెక్టర్



బుట్టాయగూడెం లో మునగ మొక్క నాటుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం: జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 4 వేల మునగ మొక్కలు నాటుతున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుట్టాయగూడెం సమీపంలోని బీసీ కాలనీ వద్ద ఉన్న అంగన్‌వాడి కేంద్రం-5 లో బుధవారం కలెక్టర్ మునగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మునగ చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మునగ చెట్టులో ప్రతి భాగం ఉపయోగపడుతుందని శాస్త్రీయంగా విశ్లేషించారని చెప్పారు. మునగలో విటమిన్ సితో పాటు మాంసకృత్తులు, ఐరన్, పొటాషియం అధికంగా ఉంటాయని తెలిపారు. మునగ ఆకులు రక్తహీనతను నివారించడంతో పాటు ఎన్నో పోషక విలువలు కలిగి ఉన్నాయన్నారు. మునగ చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మునగ చెట్లు నాటాలని నిర్ణయించామన్నారు. అనంతరం బుట్టాయగూడెం-5 అంగన్‌వాడీ కేంద్రాన్ని, బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించారు.

దెందులూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ



దెందులూరు పోలీస్ స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐజీ అశోక్‌కుమార్

దెందులూరు: దెందులూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, స్టేషన్ పరిస్థితుల్ని పరిశీలించారు. క్రైం రేట్ నివారణకు, ట్రాఫిక్, పెండింగ్ సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో దెందులూరు ఎస్‌ఐ ఐ.వీర్రాజు, స్టేషన్ సిబ్బంది విధి నిర్వహణ పట్ల డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్పీ డీ.మేరీప్రశాంతి, డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, పెదవేగి సీఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్‌గా కే.శశిధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామీణ స్వయం శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల యువతకు ఉపాధి కల్పించే దిశగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వచ్చే వారం కంప్యూటర్ ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్ కోర్సులతో పాటు బ్యూటిషియన్ కోర్సుల్లో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు మాత్రమే ఈ కోర్సుల్లో అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా ఫోన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, అనంతరం నేరుగా తమ సంస్థ కార్యాలయంలో ప్రవేశం పొందాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9502723561 ఫోన్ నెంబర్‌లో తమను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎయిడ్స్, టీబీ విభాగంలో పోస్టుల భర్తీ

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి కార్యాలయం పరిధిలో పలు పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు ఈ నెల 9 వరకూ గడువు పెంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం-ఎన్‌టీఈపీ స్కీంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డీటీసీ భీమవరం- 1 పోస్టు, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఏలూరు -1 పోస్టు, జిల్లా పీపీఎం కో ఆర్డినేటర్ భీమవరం -1 పోస్టు, సీనియర్ డీఆర్‌టీబీ సూపర్‌వైజర్ ఏలూరు- 1 పోస్టు, అక్కౌంటెంట్ భీమవరం -1 పోస్టు భర్తీ చేస్తామని తెలిపారు. అభ్యర్థులు వెస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, ఏలూరు.ఏపీ.జీవోవి.ఇన్‌ను సందర్శించాలని కోరారు. ఈ నెల 9 తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

కొల్లేరు చుట్టూ రక్షణ రేఖ

- ఎకో సెన్సిటివ్ జోన్‌పై కలెక్టరు కీలక సమావేశం
- బుడమేరు డ్రెయిన్‌లో చెత్త నివారణకు చర్యలు
- 18 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం



ఏలూరు కార్యాలయంలో ఎకో సెన్సిటివ్ జోన్ కమిటీ సభ్యులతో కలెక్టరు ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

కైకలూరు: కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య పరిరక్షణ, ఎకో సెన్సిటివ్ జోన్(సున్నిత పర్యావరణ ప్రాంతం) సరిహద్దుల గుర్తింపు కోసం సమగ్రమైన ప్రతిపాదనలు ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. కలెక్టరు వె.ప్రసన్న వెంకటేష్ చైర్మన్ హోదాలో 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు అత్యవసర సమావేశం మంగళవారం అటవీశాఖ అధికారులతో నిర్వహించారు. వన్యప్రాణుల విభాగం డీఎఫ్ఓ ఎస్.రవిశంకర్ ఎకో సెన్సిటివ్ జోన్ విధి విధానాలతో పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. కొల్లేరు సున్నిత ప్రాంతం పరిరక్షణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టరు నిర్ణయించారు. పర్యావరణవేత్తల ఫిర్యాదులతో 1999లో ప్లస్5 కాంటూరు వరకు పూర్వపు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 77,131 ఎకరాలను కొల్లేరు అభయారణ్యంగా గుర్తించారు. దీని పరిరక్షణకు సుప్రీంకోర్టు ఆదేశాలతో జీవో 120ను అమలు చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఏలూరు, ఉంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. మొత్తం కొల్లేరు పరివాహక ప్రాంతాల పరిధిలో 96 గ్రామాల్లో దాదాపు 3.5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు.

గ్రామ సభల నిర్వహణ

కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం, వన్యప్రాణుల అభయారణ్యాన్ని ఎకో సెన్సిటివ్ బఫర్ జోన్‌గా నిర్ధారించే గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారు. సంబంధిత శాఖల సమన్వయంతో మండల కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఏలూరు ఆర్డీఓ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. గ్రామ సభలు నిర్వహించేందుకు 14 రోజుల ముందు నోటీసులు జారీ చేసి, గ్రామంలో ఏ తేదీన నిర్వహించేది నోటీసు ప్రదర్శిస్తారు. గ్రామ సభలో వచ్చే సలహాలు, అభ్యంతరాలు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు సమర్పించిన నివేదికతో తదుపరి సమావేశంలో సమీక్షించి తుది ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. కలెక్టర్ చైర్మన్‌గా అటవీ, వన్యప్రాణి, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయం, పశుసంవర్థక, గ్రౌండ్ వాటర్, ఏలూరు మున్సిపల్ కమిషనర్, పర్యావరణ ఇంజినీర్, సర్వే, పర్యావరణ శాస్త్రవేత్తలు, ఎన్జీవో ఇలా కమిటీ సభ్యులు వీటిని పర్యవేక్షించి నివేదిక తయారు చేస్తారు.

బుడమేరు ప్రక్షాళనకు చర్యలు

కొల్లేరుకు 67 మేజర్, మైనర్ డ్రెయిన్ల ద్వారా ప్రతి ఏటా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. వీటిలో ప్రధానంగా విజయవాడ నుంచి వచ్చే బుడమేరు ప్రధానమైన డ్రెయిన్. ప్రధానంగా కొల్లేరు కలిసే మార్గంలో ఎక్కడైతే డ్రెయిన్ తక్కువ వెడల్పు ఉంటుందో అక్కడ చెత్త పెరుకుపోతుందని కలెక్టరు గుర్తించారు. అక్కడ చెత్తను ప్రత్యేక పద్ధతుల ద్వారా తొలగించాలని నిర్ణయించారు. చెత్తను నిల్వచేయడానికి రెండు నుంచి మూడు ఎకరాల స్థలం కేటాయించి, చెత్త నుంచి సంపద తయారీ పద్ధతులు అవలంభించాలని సూచించారు. ఈ పద్ధతుల ద్వారా కొల్లేరుకు కలుషిత నీరు చేరకుండా చర్యలు తీసుకోవచ్చని కలెక్టరు పేర్కొన్నారు.

ఎకో సెన్సిటివ్ జోన్ కీలకం



కొల్లేరు అభయారణ్య ప్రాంతం సరిహద్దుల నుంచి 10 కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ నిర్ణయించే అవకాశం ఉంది. స్థానిక పరిస్థితుల బట్టి విస్తీర్ణం తగ్గవచ్చు. ఈ పరిధిలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలంటే పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లా కలెక్టరు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు స్వీకరించి నిర్ణయం తీసుకుంటారు.

– ఎస్‌వీకే.కుమార్, అటవీశాఖ రేంజర్, ఏలూరు.

ఎకో సెన్సిటివ్ జోన్‌గా కొల్లేరు



కొల్లేరు వన్యప్రాణి అభయారణ్య ప్రాంతాన్ని ఎకో సెన్సిటివ్ జోన్(ఈఎస్‌జెడ్)గా గుర్తించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర, పర్యావరణ అటవీ శాఖ ఎకో సెన్సిటివ్ జోన్‌ను ప్రకటిస్తోంది. దీని ప్రకారం అభయారణ్య సరిహద్దుల నుంచి 1 నుంచి 10 కిలోమీటర్ల పరిధి వరకు పర్యావరణానికి హాని కలిగించే పనులు నిషేధం.. వీటిలో తవ్వకం, స్టోన్ క్వారీయింగ్, క్రషింగ్ యూనిట్లు, మిల్లులు, పరిశ్రమలు ఏర్పాటుకు వీలుండదు. ఇప్పటికే తిరుమల శేషాచల కొండలు, జ్యూ పార్కు ఎకో సెన్సిటివ్ జోన్‌గా కేంద్రం ప్రకటించింది. జోన్ ప్రకటన వల్ల అభయారణ్య ప్రాంత అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు విడుదల చేస్తోంది.

కార్పొరేట్‌కు దీటుగా మెడికల్ కళాశాలలు



మాట్లాడుతున్న హెల్త్ యూనివర్సిటీ వీసీ

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా అద్భుతమైన రీతిలో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సంకల్పాన్ని నిజం చేసి చూపించారని వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బాబ్జీ అన్నారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలను ఆయన సందర్శించారు. వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు, ల్యాబ్స్, లెక్చర్ హాల్స్ పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, వైద్య విద్య అదనపు డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైస్ చాన్సలర్ బాబ్జిని ఘనంగా సత్కరించారు. కళాశాలలో పరిస్థితులను ఆయనకు వివరించారు. వైద్య విద్యార్థులను ఉద్దేశించి బాబ్జి మాట్లాడుతూ ... ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని వైద్య విద్యార్థులంతా అత్యుత్తమ స్థాయి ప్రతిభను చాటుకుంటూ రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా పేరు తెచ్చుకోవాలని చెప్పారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం మాటలను గుర్తు చేస్తూ వైద్య విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. వైద్య విద్య అభ్యసించే వారు 99 శాతం తమ కోర్సును పూర్తి చేసుకుని పట్టాతో బయటకు వెళతారని చెప్పారు. వైద్య విద్యలో నాలుగుసార్లు ఉత్తీర్ణత సాధించేందుకు అవకాశం ఉంటుందనీ, విద్యార్థులు కష్టపడి కోర్సును పూర్తి చేయాలని చెప్పారు. కొందరు స్పెషలిస్ట్ వైద్యులుగా తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకుంటూ ఉత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మరింత దోహద పడుతుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బుట్టాయగూడెం మండల పరిధిలో అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, ఐటీడీఏ పీఓ యం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పి.శ్రీపూజ, జెడ్పీటీసీ కె.రవికుమార్, ఆర్డీఓ ఎం.ఝాన్సీ రాణి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుట్టాయగూడెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో 155 అర్జీలు అందాయని కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలను పారదర్శకంగా నిర్దేశించిన గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ స్పందనలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లు ఉంచకుండా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మండలంలోని గురుగుమిల్లి నుంచి చింతకొండ వరకూ సీసీడీపీ నిధుల నుండి బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా అనుమతులు ఉన్నా ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో మూడు నెలలుగా రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని సతీష్ కుమార్ అనే యువకుడు అర్జీ ఇచ్చాడు. నిమ్మలగూడెంకు చెందిన యండమూరి కుమారి అనే మహిళ తన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి అభ్యంతరాలు తెలుపుతున్నారని అర్జీ అందజేసింది. పోగొండ జలాశయ నిర్మాణానికి తన భూములు తీసుకున్నారని దీనికి సంబంధించిన భూ నష్ట పరిహారాన్ని ఇప్పించాలని పాలకుంటకు చెందిన సరియం వెంకటేశ్వరరావు దరఖాస్తు అందజేశారు.

బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల దేవదాయ, ధర్మాదాయ శాఖ అధీనంలోకి వచ్చిన నగరంలోని సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామి వారికి చెందిన ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆ శాఖకు చెందిన రాజమహేంద్రవరంలోని ఆభరణాల తనిఖీ అధికారి ఏ.దుర్గా భవాని ఆలయంలోని ఆభరణాలను లెక్కించి తూకం వేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం పత్రికలకు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల్లో వెండి ఆభరణాలు 27.916 కేజీలు వచ్చాయని, బంగారు ఆభరణాలు 43.160 గ్రాములు ఉన్నాయని తెలిపారు. ఏలూరు జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి సీహెచ్. రంగారావు పర్యవేక్షణలో జరిగిన ఆభరణాల లెక్కింపు, తూనిక కార్యక్రమంలో ఏలూరు డివిజన్ ఇన్స్‌పెక్టర్ బీఎల్ నరసింహారావు, కార్యనిర్వహణాధికారులు ఎం.రాధ, ఏ. రవిశంకర్, సీహెచ్‌వీ నాగముణేశ్వర రావు, సీహెచ్ చిన నాగేశ్వర రావు, పీ. రీనా మాధురి తదితరులు పాల్గొన్నారు.

7న ఏలూరులో మినీ జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, ఏపీఎస్ఎస్‌డీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టిసి/ఐటీఐ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి తెలిపారు. యంగ్ ఇండియా కంపెనీలో మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌లో 40 ఖాళీలకు ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థి వయస్సు 18-28, పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదవాలని, ఎంపికైన వారికి ట్రైనింగ్‌లో రూ.10వేలు, ఆ తర్వాత రూ.25 వేల వరకూ ఇస్తారన్నారు. మాక్స్ సెక్యూరిటీలో 80 ఉద్యోగాలకు ఎంపికలు ఉన్నాయన్నారు. సెక్యూరిటీ, డ్రైవర్ల ఉద్యోగాలకు పురుష అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎల్ఐసీలో 100 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 88868 82032లో సంప్రదించాలన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం సదస్సులో వక్తలు





సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం సదస్సుకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని.. ఇక్కడి పథకాలపై అధ్యయనం చేయడానికి ఇతర రాష్ట్రాల వారు వస్తున్నారని సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం, సీఆర్ మీడియా అకాడమీ గవర్నమెంటు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ కల్యాణమండపంలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు చూడాలనుకుంటున్నారని.. విశ్వసనీయతకు చిరునామాగా జగన్ నిలిచారని, వాస్తవాలు మార్చి, వక్ర ప్రచారానికి దిగే ప్రతిపక్షాలను ప్రజలు పట్టించుకొనే స్థితిలో లేరని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసు, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, రాష్ట్ర గ్రంథాలయ కమిటీ చైర్మన్ మండపాటి శేషగిరిరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదస్సును వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. మాటపై నిలబడి ఇచ్చిన హామీలు నేరవేర్చే కుటుంబం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. ఒక మంచి ఆలోచనతో, సంక్షేమ పాలనకు కట్టుబడి ప్రజా పక్షాన సీఎం నిలబడ్డారన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల బాధలు తెలుసుకొని సామాజిక న్యాయం, విద్య, వైద్య, వ్యవసాయం, మహిళా సాధికారతకు పాలనలో పెద్దపీట వేశారని.. మంత్రివర్గ కూర్పులో సామాజిక న్యాయం ప్రధానిని కూడా ఆశ్చర్యపడేలా చేసిందన్నారు. గడపగడపకు పేరుతో ప్రజల దగ్గరకు వెళ్లే ధైర్యం జగన్ పాలనలో పాలకులకు వచ్చిందన్నారు. ప్రతిపక్షాలు అవగాహన రాహిత్యంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని.. జైలులో ఉన్న వ్యక్తికి సాష్టాంగ నమస్కారం చేసి, ఆ పార్టీతో పొత్తు పెట్టుకని ఎన్నికలకు వెళతామని చెబుతున్న జనసేన నాయకుడి వైఖరి మెడకు రాయి కట్టుకొని గోదారిలో దూకినట్టుగా ఉందన్నారు. కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టుపై కొవ్వూరి త్రినాథరెడ్డి, మహిళా సాధికారతపై గిరిజ, రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై రత్నాకర్, సుపరిపాలనపై జయకర్, జీఎస్టీ విధానంపై చాంబర్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాలపై విద్యార్థులు విష్ణువర్ధన్, సూర్యలు వివరించారు. మంత్రి కొట్టు విజన్ గురించి న్యాయవాది శిరిగినీడి విజయకృష్ణలు వివరించారు. డిజిటల్ ఎడ్యుకేషన్‌పై రత్నరాజు మాట్లాడారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ముప్పిడి సంపత్‌కుమార్, గ్రంధి సత్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ పాల్గొన్నారు.

జగన్‌ది సుపరిపాలన



హామీలు ఇచ్చారు వీటిని అమలు చేయగలరా అనే అనుమానాలను పటాపంచలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే. జగన్‌ది సుపరిపాలన. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు ప్రజలకు మేలు చేస్తున్నాయి. వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు, ఆర్‌బీకెలు అభివృద్ధిలో భాగమే . పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం అమలు చేస్తున్నారు. 15 వేల మందికి ఉపాధి కల్పించేందుకు విశాఖలో డాటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. నిన్నటికి, నేటికి తేడా ఉందా లేదా అనే విషయాన్ని విశ్లేషించుకోవాలి. అత్యధిక సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. అద్భుతపాలన సాగుతుంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి పచ్చి అబద్ధాలు రాస్తున్నాయి. పేద, అట్టడుగు వర్గాలకు సంక్షేమం అందుతుంది.

– కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్


నెగెటివ్ ప్రచారం తిప్పికొట్టాలి



పాలన అంటే ఇంకుడు గుంటలు, నీరు చెట్టు, పనికి ఆహారం అన్నట్టుగా సాగిన చంద్రబాబు పాలన కంటే భిన్నంగా జగన్ పాలన సాగుతోంది. పాలనపై నెగెటివ్ ప్రచారం ఖండించాలి. 113కు పైగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకే దక్కుతుంది. ఆహార ధాన్యాలు, నూనె గింజలు, పండ్లు, కూరగాయల ఎగుమతిలో రాష్ట్రం అగ్రగామిగా ఉంది. 1923లో విశాఖలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు, 58 వేల మంది సిబ్బందిని భర్తీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. పాలనను ఇంటి వరకు చేరువ చేసిన ఖ్యాతి జగన్‌దే. నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో కరువు మండలం లేదు.

– ఎంవీఎస్.నాగిరెడ్డి, ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్

అల్లుడి బాగోతం అత్తే చెప్పాలి



అల్లుడి బాగోతం (చంద్రబాబుది) అత్తే చెప్పాలి. ఎవరో చేసిన పనులను తన ఖాతాలో వేసుకొనే బుద్ధి చంద్రబాబుది. ప్రపంచ స్థాయి ఖ్యాతి జగన్ సారథ్యంలో రాష్ట్రానికి దక్కింది. మనసుతో ఆలోచించి పథకాలు అమలు చేసే ఒకే ఒక్క సీఎం చరిత్రలో జగన్ ఒక్కరే. ఆయన చల్లిన విత్తనాలకు మొలకలు వస్తున్నాయి. గుడిసెల్లో ఉండే విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుతుంది. ఒక తండ్రిలా, అన్నలా, కొడుకులా పథకాలను అమలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు ఖాయం.

– నందమూరి లక్ష్మీపార్వతి, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్

పేదల ఆత్మగౌరవం పెరిగింది

పేద ప్రజల ఆత్మగౌరవం జగన్ పాలనలో పెరిగింది. జగన్ పాలన జీవితాంతం అవసరం. అంబేడ్కర్ విధానాన్ని ఆత్మగౌరవ నినాదాన్ని నిజం చేసిన వ్యక్తి జగన్. ఇలాంటి వ్యవస్థను నిర్మించడానికి జగన్ కృషి చేశారు.

– మండపాటి శేషగిరిరావు, ఏపి గ్రంథాలయ కమిటీ చైర్మన్

క్లుప్తంగా

అంబేడ్కర్‌పై పవన్ వ్యాఖ్యలు సరికాదు


తుందుర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళిత నాయకులు

భీమవరం అర్బన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు విరమించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం దళిత ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ సిఫార్సుతో బీఆర్ అంబేడ్కర్‌కు డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ పదవి వచ్చిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం దళితులను అవమానించడమేనన్నారు. పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై విమర్శలు చేస్తే దళిత ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ ధర్నాలో మద్దా ఆహరోన్, తోటే రాజు, విప్పర్తి, కిరణ్, బి.సామ్యేయేల్, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


పెంటపాడు: ప్రత్తిపాడులో ఆరోగ్య శిబిరం వద్ద ప్రజలు

ప్రజారోగ్యానికి భరోసా


భీమడోలు : చిన్నపిల్లలను పరిశీలిస్తున్న వైద్యురాలు

ప్రజారోగ్యమే పరమావధిగా.. రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య శిబిరాలను బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. వేలాది మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు శిబిరాల నిర్వహణను పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్


నరసాపురం రూరల్ : లక్ష్మణేశ్వరంలో మెడికల్ కిట్ అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


వీరవాసరం : గవరపాలెంలో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


నూజివీడు : ఆగిరిపల్లిలో వైద్య కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


ముదినేపల్లి రూరల్ : అల్లూరులో వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు


జంగారెడ్డిగూడెం : కంటి పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎలీజా


ఏలూరు టౌన్ : 13వ డివిజన్‌లో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి


శీలం ప్రభాకర్ (ఫైల్)

ఆకివీడు: ఇల్లు ఖాళీ చేస్తున్న స్నేహితుడి ఇంట్లో ఇన్వర్టర్ తీసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన శీలం ప్రభాకర్ (29) ఏలూరు జిల్లా గణపవరం గ్రామంలోని ఐఫీడ్ సంస్థలో టెక్నీషియన్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం దైవదర్శనానికి వెళ్లి తిరిగి రాగా, బుధవారం ఆకివీడులోని స్నేహితుడికి ప్రసాదం ఇచ్చేందుకు అతని ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో స్నేహితుడు ఇల్లు ఖాళీ చేస్తుండగా అతనికి సహకరిస్తూ ఇన్వర్టర్‌ను తీసే ప్రయత్నం చేయగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్నేహితుడు వెంటనే అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లే సరికి అప్పటికే ప్రభాకర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి


రవికుమార్ మృతదేహం

భీమవరం అర్బన్: రొయ్యల కంటెయినర్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. దిరుసుమర్రుకు చెందిన వర్ధనపు రాజ్‌కుమార్ (40) యనమదుర్రు గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం ప్రాసెసింగ్ యూనిట్‌లో రొయ్యల కంటెయినర్ డ్రైవర్ లారీని రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న రాజ్‌కుమార్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

తెలంగాణ రేషన్ బియ్యం పట్టివేత


లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

టి.నరసాపురం: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టి.నరసాపురం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక జెడ్పీ హైస్కూల్ జంక్షన్ వద్ద కామవరపుకోట సీఎస్‌డీటీ మొహిద్దీన్‌తో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పీడీఎస్ బియ్యాన్ని సిద్దిపేట మండలం ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ జమాలుద్దీన్, అయిత కృష్ణ లారీలో తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. 20 టన్నుల రేషన్ బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నామని, సీఎస్‌డీటీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కాపలాదారుడి మృతి

మండవల్లి: పెరికెగూడెంలో చెరువు గట్టుపై ఓ కాపలాదారుడు మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రమోద్ పెరికెగూడెంలోని ఓ రైతుకు చెందిన చేపల చెరువుపై కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వర్షం పడుతుండగా చెరువు చుట్టూ లైట్లు వేయడానికి బయటకు వెళ్లాడు. ఎంతకీ రానందున అక్కడ పనిచేస్తున్న వారు వెళ్లి చూడగా ప్రమోద్ చెరువుగట్టుపై పడి ఉన్నాడు. దీంతో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘అక్షజ’తో మాతాశిశు మరణాల నివారణ

- గర్భిణుల్లో రక్తహీనత సమస్య దూరం
- బుట్టాయగూడెంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- గర్భిణులకు అక్షజ పౌష్టికాహార కిట్ల పంపిణీ


బుట్టాయగూడెంలో అక్షజ పౌష్టికాహార కిట్‌లను మహిళలకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, అధికారులు

బుట్టాయగూడెం: జిల్లాలో మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టేందుకు అక్షజ కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, మార్పు సేవా సంస్థల సహకారంతో చేపట్టిన అక్షజ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత నివారణకు 6 నెలల పాటు పౌష్టికాహార కిట్‌లను అందజేస్తామన్నారు. శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆర్.సూయిజ్, ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ నేతృత్వంలో ప్రొటీన్ కలిగిన పొడి, మునగాకుతో తయారు చేసిన లడ్డూలతో చేసిన న్యూట్రిషన్ ప్యాకెట్‌లను పైలెట్ ప్రాజెక్టుగా గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లితోపాటు టి.నర్సాపురం మండలంలో గర్భిణులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. విజయవాడ, మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారని, అక్కడ మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత సమస్యతో గర్భిణులు డెలివరీ సమయంలో ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ వీటిని మహిళలు తీసుకుంటున్నారా లేదా అనే విషయాన్ని స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పర్యవేక్షణ చేస్తారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గోరుముద్ద, టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతోందని అన్నారు. పిల్లలకు రాగి, చిక్కీలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం పలువురు మహిళలకు అక్షజ పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, మార్పు సేవా సంస్థ ప్రతినిధి ఆర్.సూయిజ్, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, ఆర్‌డీఓ ఎం.ఝాన్సీరాణి, డీఈఓ శ్యామ్ సుందర్, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీఎం అండ్ డీహెచ్‌ఓ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, తహసీల్దార్ ఎస్ఎస్.శాంతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వదేశంలో పునరావాస కేంద్రానికి టీబీ బాధితురాలు


ఎయిర్‌పోర్టులో మణెమ్మను రిసీవ్ చేసుకుంటున్న ఏఎస్ఐ, వైద్య అధికారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ మహిళకు టీబీ సోకగా, అక్కడ చికిత్స పొందుతూ స్వదేశంలో వైద్యం కోసం అర్జీ పెట్టుకుంది. దీంతో అక్కడి అధికారులు అందించిన సమాచారంతో బుధవారం ఏలూరులోని ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌కు ఆమెను తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన ఎమ్.మణెమ్మ అనే మహిళ గత ఏడాది సెప్టెంబర్‌లో ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లింది. డిసెంబర్‌లో ఆమెకు టీబీ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో తాను స్వదేశానికి వెళ్లేందుకు అనుమతించాలని అధికారులకు అర్జీ పెట్టుకుంది. ఆమె స్వదేశానికి వెళ్లేందుకు వీల్ చైర్ ద్వారా ఒక నర్సు సహాయంతో ప్రయాణం చేయవచ్చని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఈఏఐ మణెమ్మను స్వదేశం పంపడానికి వివరాలు అడుగగా ఆమెకు ఎవరూ లేరని తెలుసుకుని స్వదేశంలో చికిత్స పొందే హెల్త్ కేర్ సెంటర్ వివరాలు తెలియజేస్తే తమ దేశం నుంచి ఆమెను పంపడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఏపీఎన్ఆర్టీఎస్ ప్రెసిడెంట్ వెంకట్ ఎస్.మేడపాటిని కోరింది. ఏపీఎన్ఆర్టీఎస్ ఈ విషయాన్ని ఏలూరు కలెక్టరేట్‌కు తెలియజేయగా, సెయింట్ ఆన్స్ లయోలా ప్రేమ్ నివాస్ రిహాబిలిటేషన్ సెంటర్లో ఉండడానికి అనుమతిస్తూ లేఖను ఇ–మెయిల్ ద్వారా ఏపీఎన్ఆర్టీఎస్‌కు కలెక్టరేట్ అధికారులు పంపారు. ఈ విషయాన్ని ఏపీఎన్ఆర్టీఎస్ ఈఏఐ దుబాయ్ వారికి తెలిపింది. దీంతో ఈఏఐ హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌కు విమాన టికెట్ బుక్ చేసి, ఈ నెల 3వ తేదీన మణెమ్మకు తోడుగా ఒక నర్స్‌ను పంపారు. వారిని రిసీవ్ చేసుకున్న మహిళా ఏఎస్ఐ, వైద్యాధికారి సురక్షితంగా ఏలూరులోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు చేర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయలక్ష్మి, డీఆర్వో మూర్తి, ఈఏఐ దుబాయ్ ప్రతినిధులకు ఏపీఎన్ఆర్టీఎస్ కృతజ్ఞతలు తెలిపింది.

● గడపగడపకు సంక్షేమం


పెదవేగి : వంగూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

కోడిపందేలపై దాడి

ఉండి: మండలంలోని కోలమూరులో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంపై ఉండి పోలీసులు ఎస్సై కే గంగాధరరావు ఆధ్వర్యంలో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.64,610 నగదు, మూడు కోళ్లు, మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పుల్లలలోడు లారీ బోల్తా

వాంద్రం రోడ్డుపై పుల్లలోడు లారీ బుధవారం ఉదయం తిరగబడింది. వివరాలిలా ఉన్నాయి. ఉండి వైపు నుంచి వాంద్రం వైపుగా వెళుతున్న పుల్లలలోడు లారీ వాంద్రం రైల్వే గేటు దాటిన అనంతరం ఓ గొయ్యిలో పడటంతో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సుపారీ గ్యాంగ్‌లో ఇద్దరి అరెస్ట్?

- మరో ఇద్దరి నిందితుల కోసం గాలింపు
- ఘటనా స్థలంలో తుపాకీ బుల్లెట్ షెల్స్?

ఏలూరు టౌన్: ఏలూరులో సుపారీ గ్యాంగ్ సెటిల్‌మెంట్ వ్యవహారం వెలుగులోకి రావడంతో నగరంలో గన్‌కల్చర్‌పై ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఆర్‌పేటలోని ఓ హోటల్‌లో ఒక వ్యక్తిని నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. రియల్టర్ కాంతారావును నిర్బంధించిన ఈ కేసులో సుపారీ గ్యాంగ్‌లోని ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఇదే కేసులో మరో ఇద్దరి నిందితులను పట్టుకునేందుకు పోలీస్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

బుల్లెట్ షెల్స్ స్వాధీనం?

రియల్టర్ కాంతారావును సుపారీ గ్యాంగ్ రాత్రివేళ నిర్మానుష్య ప్రాంతానికి బలవంతంగా తీసుకువెళ్లి తలపై ముగ్గురు తుపాకీలు గురిపెట్టగా, ఇద్దరు తుపాకీలను గాల్లో పేల్చినట్లు సమాచారం. ఈ బుల్లెట్ షెల్స్‌ను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. 9 ఎంఎం పిస్టల్‌తో బాధితుడిని బెదిరించారని, వాటికి సంబంధించిన షెల్స్ దొరికాయని చెబుతున్నారు.

హోటల్‌లో సెటిల్‌మెంట్ :

నగరంలోని ఒక హోటల్‌లో రూమ్ తీసుకుని సెటిల్‌మెంట్ చేసేంత ధైర్యం వినయ్‌రెడ్డి, సతీష్‌రాజుకు ఉందా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి అండగా ఉంటూ సెటిల్‌మెంట్ చేసేందుకు ఒప్పందం చేసుకున్నది ఎవరనే కోణంలో పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు. బాధితుడిని చిత్రహింసలకు గురిచేస్తూ వీడియోను ఎవరికి చూపించారనే విషయంపై పోలీసులు ఫోకస్ చేశారు. హోటల్‌లోని సీసీ టీవీ ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



● అప్రమత్తంతో తప్పిన ముప్పు

ఏలూరులోని ఇండోర్ స్టేడియం భవనం పైకప్పు బుధవారం కురిసిన వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్ ఉండగా, ప్రతిరోజూ ఇక్కడ సాధన చేసేందుకు క్రీడాకారులు వస్తుంటారు. కొంతకాలం క్రితం ఇండోర్ స్టేడియం భవనం కుంగిపోవడాన్ని గుర్తించిన అధికారులు ముందస్తు చర్యగా ఈ భవనానికి తాళం వేశారు. పైకప్పు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. – సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు